క్లుప్తంగా

పైపులైన్‌కు మరమ్మతులు


పైపులైన్‌ను బాగుచేసిన దృశ్యం

కడప కార్పొరేషన్ : కడప నగరం రామాంజనేయపురం పరిధిలోని వరదకాలనీ సెంటర్‌లో పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి నెల రోజులుగా త్రాగునీరు వృథాగా పోతుండేవి. ఈ విషయాన్ని ఈనెల 25వ తేదీ 'పగిలిన పైపులైన్' పేరుతో సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు ఒక్క రోజులోనే పైపులైన్‌కు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించారు.సమస్య పరిష్కారం కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

దొరల సమాధులను కూల్చొద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలో ఎంతో చరిత్ర గల దొరల సమాధులను కూల్చివేసే ఆలోచనను విరమించుకోవాలని పలువురు క్రైస్తవులు మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్‌ను కోరారు. బుధవారం ఈ మేరకు వారు కమిషనర్‌కు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో పాస్టర్స్ పీస్ కమిటీ మెంబర్ ప్రసాద్ రావు, విజయ్ కిషోర్, షెడ్రక్, జాన్, మోషే, మాణిక్యాలరావు, పుష్పరాజ్, సంపత్, సురేష్ కమిషనర్‌ను కలిశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కడప రూరల్ : ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాలను నివారించాలని షా సోషల్ జస్టిస్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వ్యవస్థాపకులు షా మహమ్మద్, జిల్లా అధ్యక్షుడు పీ ఖాదర్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక మట్టి పెద్ద పులి వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు అతి వేగంగా వెళ్లడం, ద్విచక్రవాహనదారులు ముగ్గురు ప్రయాణించడం, ఏ మాత్రం ట్రాఫిక్ రూల్స్‌ను పాటించకపోవడం వల్ల ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. వీటిని నివారించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో అలీ షేర్, ఇమ్రాన్‌ఖాన్, మహబూబ్‌బాషా, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 4న కడపలో సదస్సు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : మోదీప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మికుల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నవంబరు 4న జిల్లా సదస్సు జరగనుంది. దీనిని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయు జిల్లా కార్యదర్శులు నాగసుబ్బారెడ్డి, మనోహర్ పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వాన్ని సాగనంపాలని దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా నవంబర్ 26, 27, 28 తేదీలలో విజయవాడ రాజభవన్ వద్ద జరిగే మహాధర్నాలను జయప్రదం చేయాలన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు పంటలకు సమగ్ర ఉత్పత్తి వ్యయానికి అదనంగా 50% కలిపి చట్టబద్ధ మద్దతు ధరలు ప్రకటించాలన్నారు. కౌలు రైతులతో సహా రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పెంచి పంట రుణాలు అందించాలని, కేరళ తరహాలో రైతు రుణ ఉపశమన చట్టాన్ని పార్లమెంటులో చేయాలన్నారు. సమావేశంలో కార్మిక సంఘం నాయకులు దస్తగిరిరెడ్డి, ఎంబీ సుబ్బారెడ్డి, కేసీ బాదుల్లా, మద్దిలేటి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం : జిల్లాలోని బీడి కార్మికులు చదువుకునే తమ పిల్లల ఉపకార వేతనాల కోసం 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని కమలాపురం బీడి కార్మిక సంక్షేమ ఆసుపత్రి వైద్యాధికారి ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 10 వ తరగతి వరకు చదివే విద్యార్థులు నవంబర్ 30వ తేదీలోపు, అలాగే ఇంటర్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులు డిసెంబర్ 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు గతేడాదికి సంబంధించిన మార్కుల జాబితా, ఆధార్ కార్డు, బ్యాంక్ పాసు పుస్తకం, బీడి కార్మిక సంక్షేమ సంఘం జారీ చేసిన కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో స్కాలర్‌షిప్స్.జీఓవీ.ఇన్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

ఆరోగ్య సురక్షతో ఇంటి వద్దకే వైద్య సేవలు

దువ్వూరు : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దనే వైద్య సేవలు అందుతున్నాయని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నీలాపురం గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జేసీ పరిశీలించారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు జేసీ సూచించారు. ఈ వైద్య శిబిరంలో 546 మందికి బీపీ, షుగర్, కంటి సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా కొంత మంది విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సమీర తెలిపారు.

వైభవం.. పుష్పయాగం

ముగిసిన దసరా ఉత్సవాలు

కడప కల్చరల్ : శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. తొమ్మిదిరోజులపాటు నగరంలోని అమ్మవార్ల ఆలయాల్లో రోజుకో అలంకారం చొప్పున ఉత్సవ మూర్తులను భక్తుల దర్శనార్థం కొలువుదీర్చారు. ప్రధానమైన రోజుల్లో భక్తులు ఆలయాలకు పోటెత్తారు. దుర్గాష్టమి, విజయదశమితో ప్రధాన కార్యక్రమాలు పూర్తి కాగా, మంగళ, బుధ వారాల్లో పవళింపుసేవ, పుష్పయాగం నిర్వహించారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఉత్సవ కమిటీ చైర్మన్ బెస్తవేముల రామమహేష్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మునగా శ్రీనివాసులు ఆధ్వర్యంలో పవళింపు సేవ, పుష్పయాగం నిర్వహించారు. భక్తులందరూ తమకు తోచిన పూలు, సుగంధ పత్రాలను అమ్మవారికి సమర్పించారు. ఎలిశెట్టి శివకుమార్ ప్రత్యేకంగా బెంగళూరు నుంచి 75 రకాల పుష్పాలను తెప్పించారు. 450 కిలోల పుష్పాలు, 200 కిలోల మరువం, దవనం లాంటి పరిమళ పత్రాలను అమ్మవారికి సమర్పించారు. అర్చక బృందం వాటిని అమ్మవారికి క్రమ పద్ధతిలో అమర్చారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్నిరకాల దోషాల పరిహారం కోసం పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా పుష్పయాగాన్ని భక్తుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. నడివీధి గంగమ్మ క్షేత్రంలో అమ్మవారికి ప్రత్యేకంగా ఊయల ఏర్పాటు చేసి సర్వాలంకార భూషితురాలైన అమ్మవారికి పవళింపు సేవ నిర్వహించారు. స్థానిక మహిళా భక్తులు భక్తి గీతాలను ఆలపించారు.


అమ్మవారికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

మధ్యాహ్నం ఉత్సవ కమిటీ నిర్వాహకులు గోపాల్‌సింగ్ దంపతులు రెండు వేల మందికి అమ్మవారి పేరిట అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.


పూలను తీసుకొస్తున్న భక్తులు

శరవేగంగా అభివృద్ధి పనులు జరగాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధి, రోడ్డు విస్తరణ పనులను శరవేగంగా జరిగేలా చూడాలని కేఎంసీ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన పలు ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. మాసాపేట రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని, డివైడర్లలో వర్మీ కంపోస్టు వేసి, మొక్కలు నాటాలన్నారు. దేవుని కడప రోడ్డు నిర్మాణం, మాచుపల్లి జంక్షన్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. దేవునికడప రోడ్డులో ఇంకా పెండింగ్‌లో ఉన్న ఆక్రమణలను తొలగించాలన్నారు. గోకుల్ లాడ్జి– కృష్ణా థియేటర్ రోడ్డులో డ్రైనేజీ కాలువ పనులను, అంబేడ్కర్ సర్కిల్– వైజంక్షన్ రోడ్డులో మార్కింగ్ ప్రకారం విస్తరణ పనులు పూర్తి చేయాలని, ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

నకాష్ అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ

నగరంలోని నకాష్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్లను పరిశీలించారు.సిబ్బందితో మాట్లాడారు. హెల్త్ సెంటర్‌కు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. హెల్త్ సెంటర్ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నూతనంగా నిర్మిస్తున్న గదిని శుభ్రం చేయించి గర్భిణులకు కేటాయించాలన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణంలో మొక్కలు నాటించాలని హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు.


దేవునికడప రోడ్డులో రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

బుడ్డాయపల్లెలో చోరీ

కడప అర్బన్ : కడప నగరం రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుడ్డాయపల్లె రోడ్డులో నివాసం ఉంటున్న అంజిరెడ్డి అనే వ్యక్తి ఇంటి తాళం పగలకొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అతను గత శనివారం కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతికి వెళ్లాడు. తిరిగి బుధవారం ఉదయం కడపకు రాగానే ఇంటి తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూశారు. బీరువాలో ఉన్న సుమారు ఆరు తులాల బంగారు ఆభరణాలను దోచి కెళ్లినట్లు అంజిరెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు ఈ సంఘనటపై రిమ్స్ పీఎస్ ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మొబైల్ ఆధార్ కేంద్రాల ఏర్పాటు

వల్లూరు : మండలంలోని పలు గ్రామాల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. 26వ తేదీన మండల పరిధిలోని అంబవరం గ్రామ పంచాయతీ కార్యాలయం, 27న పైడికాలువలోని గ్రామ సచివాలయం, 28న లేబాకలోని గ్రామ సచివాలయంలో మొబైల్ ఆధార్ కేంద్రాల ద్వారా సేవలు అందించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

కూలీలకు భూ పంపిణీ చేయాలి

కమలాపురం : భూములు లేని వ్యవసాయ కూలీలకు భూ పంపిణీ చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.బాషా కోరారు. బుధవారం 3వ వార్డు సచివాలయ అడ్మిన్ ప్రణీత్‌రెడ్డికి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద కుటుంబాలకు నెలకు రూ.10 వేల కరువు పెన్షన్ ఇవ్వడంతోపాటు 35 కిలోల బియ్యం, నిత్యావసరాలు అందించాలన్నారు. అలాగే పేద విద్యార్థులకు అన్ని రకాల ఫీజులు రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి బ్రహ్మం పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం

సిద్దవటం : మండలంలోని ఉప్పరపల్లె గ్రామం సాయినగర్‌లో భద్రాది భావనారాయణ స్వామి ఆలయంలో నవరాత్రులను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన శ్రీ దుర్గాదేవి విగ్రహాన్ని బుధవారం భక్తులు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గ్రామోత్సవంలో అమ్మవారు రథం నివాస గృహాల గుమ్మము వద్దకు రాగానే గృహిణులు అమ్మవారికి కాయాకర్పూరాలను, సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అమ్మవారి గ్రామోత్సవం ముందర స్థానిక మహిళా కళాకారులు నిర్వహించిన కోలాట నృత్య ప్రదర్శన ఎంతగానో అకట్టుకుంది.

నేడు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మైదుకూరు : పోలీసు శాఖ ఆధ్వర్యంలో మైదుకూరు జెడ్పీ హైస్కూల్ (బాయ్స్)లో గురువారం విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ టీఎం పద్మలత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు 'లైంగిక వేధింపుల నుంచి స్త్రీలు, పిల్లలకు రక్షణ – సమాజ పాత్ర' అనే అంశంపై 9, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు. మండలంలోని ప్రతి పాఠశాల, కళాశాల నుంచి వ్యాసరచన, ఉపన్యాస పోటీలకు విద్యార్థులు హాజరు కావాలని ఆమె కోరారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోండి

దువ్వూరు : మండల కేంద్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని బ్యాంకు మేనేజర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. మండలంలోని నీలాపురం గ్రామంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యత సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ డిపాజిట్లపై అన్ని బ్యాంకులకంటే ఎక్కువ శాతం వడ్డీరేట్లను అందిస్తున్నామన్నారు. తమ బ్యాంకులో ఖాతా కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రధానమంత్రి జీవన జ్యోతి, సురక్ష బీమా యోజన లాంటి ఇన్సూరెన్స్ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది నాగాంజనేయులు, ప్రతాప్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

నేడు వేలం

పోరుమామిళ్ల : మండలంలోని శ్రీ మద్దిమాను గురప్పస్వామి ఆలయంలో తలనీలాలు గురువారం ఉదయం 10 గంటలకు వేలం వేస్తున్నట్లు దేవదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి నరసయ్య, చైర్మన్ సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు లక్ష రూపాయలు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు. అలాగే షామియానాలు, వంటపాత్రలు బాడుగకు ఇచ్చుకొనుటకు వేలం జరుగుతుందని, రూ.25 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న మోదీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాజ్ వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాశ్యం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు భవనాశి వెంకట సుబ్బరాయుడు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మయూర గార్డెన్‌లో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడాతూ పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఆదేశాల మేరకు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లో తీసుకెళ్లి వారిని చైతన్యపరిచే విధంగా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా బడుగు బలహీన వర్గాలకు తీరని అన్యాయం జరుతోందని చెప్పారు మోదీ ప్రభుత్వ సంస్థలను ప్రయివేటు పరం చేస్తూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని మండిపడ్డారు. ఆంధ్ర ప్రదేశ్ లో కూడా పార్టీని బలోపేతం చేసి అన్ని జిల్లాలకు నియోజక వర్గ సమన్వ యకర్తలను ఎన్నుకొని రాబోయే ఎన్నికల్లో తమ అభ్యర్థులను బరిలో దిగేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు ప్రస్తుతం అడ్‌హక్ కమిటీ వేసి అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకోనున్నట్లు చెప్పారు.


మాట్లాడుతున్న పాశ్యం వెంకటేశ్వర్లు

మహిళలపై దౌర్జన్యాలను అరికట్టాలి

కడప కల్చరల్ : విలువలు తరిగిపోతున్న నేటి సమాజంలో మహిళలపై దౌర్జన్యాలు పెరిగిపోయాయని, వాటిని అరికట్టాలని మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు ఎస్పీ సిద్ధార్థ కౌశల్‌ను కోరారు. బుధవారం ఆయన గుంటూరు రేంజ్ ట్రాన్స్‌పోర్టు జాయింట్ కమిషనర్ డాక్టర్ భువనగిరి కృష్ణవేణితో కలిసి ఎస్పీని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తొలి తెలుగు రామాయణ రచయిత్రిగా మొల్లమాంబ, ప్రముఖ కవియిత్రిగా తాళ్లపాక తిమ్మక్క తదితరులు జిల్లాకు గొప్ప పేరు తెచ్చి పెట్టారన్నారు. అలాంటి జిల్లాలో మహిళలపై దౌర్జన్యాలు పెరగడం బాధాకరమని, మీదైనా శైలిలో వాటిని అరికట్టాలని కోరారు. అనంతరం వారు ఎస్పీని సత్కరించి జ్ఞాపికను అందజేశారు.


ఎస్పీ సిద్ధార్థ కౌశల్‌ను సత్కరిస్తున్న గానుగపెంట హనుమంతరావు

సామాజిక విప్లవకారుడు సీఎం వైఎస్ జగన్

కడప రూరల్ : సామాజిక విప్లవకారుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ డెవలప్‌మెండ్ ఆర్గనైజేషన్ (ఎంబీసీడీఓ) రాష్ట్ర అధ్యక్షుడు సుంకేసుల బాదుల్లా అన్నారు. బుధవారం సంఘం జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు తమ సంఘం తరపున సంపూర్ణ మద్దతును తెలిపారు. అనంతరం బాదుల్లా మాట్లాడుతూ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో సామాజిక విప్లవం తీసుకొచ్చారని అన్నారు. 2019 కేబినెట్‌లో 25 మంత్రి పదవులకు 14 మంత్రి పదవులు, నలుగురికి ఉప ముఖ్యమంత్రి పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కేటాయించారన్నారు. అలాగే బీసీ వర్గాలకు 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి వాటికి చైర్మన్, డైరెక్టర్‌లను నియమించారని తెలిపారు. దేశ చరిత్రలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటించారన్నారు. ఈ నేపథ్యంలో 26వ తేదీ నుంచి చేపడుతున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు తాము సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే అన్ని వర్గాల వారు ఈ యాత్రను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం గౌరవాధ్యక్షులు రసూల్, ప్రధాన కార్యదర్శి పగిడాల పెద్దన్న, బీసీ నాయకులు మల్లి యాదవ్, రావమమి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంబీసీడీఓ రాష్ట్ర అధ్యక్షులు బాదుల్లా

నిషేధిత మందులు అమ్మితే చర్యలు

వేంపల్లె : నిషేధిత కలుపు నివారణ మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు జిల్లా భూ సంరక్షణ విభాగపు సహాయ వ్యవసాయ సంచాలకులతో కలిసి ఆయన వేంపల్లెలో ఉన్న అన్ని పురుగు నివారణ మందులు, విత్తనాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని దుకాణాల్లో డూప్లికేట్ బయో పెస్టిసైడ్స్, బయోఫెర్టిలైజర్స్, రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. రైతులు కొనుగోలు చేసిన తర్వాత విధిగా బిల్లును తీసుకోవాలన్నారు. షాపు యజమానులు స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలన్నారు. దుకాణాల ముందు ధరల పట్టికను ప్రదర్శించాలని, లేనిపక్షంలో లైసెన్స్‌లను రద్దు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు రాజేంద్రప్రసాద్, నవంత్ బాబు, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, వీఏవోలు తదితరులు పాల్గొన్నారు.


పురుగు నివారణ మందులు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాలి

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఉపముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాషా అన్నారు. బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా 6 డివిజన్‌లోని విద్యుత్ నగర్ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల,మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఆయన్ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్. మల్లీశ్వరి అనే మహిళ మాట్లాడుతూ తనకు వైఎస్సార్ ఆసరా, జగనన్న అమ్మ ఒడి, ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.9.30లక్షల లబ్ధి కలిగిందని ఆనందం వ్యక్తం చేసింది. సి. నాగమణి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో తమకు వైఎస్సార్ ఆసరా, జగనన్న అమ్మ ఒడి, ఇంటి స్థలం, ఇల్లు ద్వారా రూ.9.22లక్షల వరకు మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇంత లబ్ధి చేకూరలేదని, జగనన్నకు తామంతా తోడుగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 6వ డివిజన్ కార్పొరేటర్ నాగేంద్రప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్య, రామ్మోహన్‌రెడ్డి, తోటక్రిష్ణ, బండి ప్రసాద్, తోటక్రిష్ణ, సుదర్శన్‌రెడ్డి, పస్తం అంజి, గోపాలక్రిష్ణ, అర్జున్, మహిళా నేతలు టీపీ వెంకటసుబ్బమ్మ, క్రిష్ణవేణి, తులశమ్మ, నారాయణమ్మ, సునీతరెడ్డి పాల్గొన్నారు.


'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం

చింతకొమ్మదిన్నె : పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం 18వ డివిజన్ పరిధిలోని విశ్వనాథపురం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష ఏర్పాట్లను పరిశీలించి, ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలు ఎలా ఉన్నాయ్ అంటూ ప్రజలను అడిగి వారికి మందుల కిట్లు అందజేశారు. శిబిరంలో ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్‌ను సందర్శించి ప్రజలతో మట్లాడి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికీ పరీక్షలు చేసి వారికి తగిన మందులు ఇవ్వాల్సిందిగా అధికారులకు తెలియజేశారు. అలాగే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉంటే హాస్పిటల్‌కు రెఫర్ చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోనూ మెరుగైన వైద్యం

పెండ్లిమర్రి : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని మొయిళ్లకాల్వ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మస్తాన్‌బీ, వైఎస్సార్‌సీపీ నాయకులు హుస్సేన్, క్రిష్టారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, బ్రహ్మంరెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్ రాజు, వైద్యులు పాల్గొన్నారు.


వైద్యులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

వసతి గృహంలో సౌకర్యాలు కల్పించాలి

కడప అర్బన్ : ప్రభుత్వ బాలుర గృహంలో పిల్లలకు సౌకర్యాలను కల్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి సెక్రటరీ, జడ్జి ఎస్.కవిత అన్నారు. బుధవారం జడ్జి కవిత, సిబ్బందితో కలిసి ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని, ప్రభుత్వ పరిశీలన గృహాన్ని సందర్శించారు. పిల్లలకు అందుతున్న వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వంటశాలను, వసతి గదులను రిజిస్టర్‌లను పరిశీలించారు. పిల్లల పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్త వహించాలని ఆదేశించారు. జువైనల్ జస్టిస్ చట్టం, న్యాయసహాయం, రక్షణ సలహా వ్యవస్థ (ఎల్ఏడీసీఎస్) ఉచిత న్యాయ సహాయం వంటి అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరింటెండెంట్ వైద్యాధికారి, పిల్లలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి కవిత

సమస్యలు పరిష్కరించాలని వినతి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో దాదాపు 60 మంది ఉపాధ్యాయులకు పొసిషన్ ఐడీ రాక టెక్నికల్ సమస్యతో మూడు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు పేర్కొన్నారు. ఈ విషయమై బుధవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్సీ విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, జిల్లా నాయకులు రాముడు, మదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్టీఎఫ్ నాయకులు

చంద్రబాబు నిజాయితీని నిరూపించుకోవాలి

కడప కార్పొరేషన్ : స్కిల్ స్కాంలో అవినీతికి పాల్పడిన సొమ్మును ప్రతిపక్షనేత చంద్రబాబు ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా సేకరించిన 7వేల పోస్టు కార్డులన్నింటినీ హెడ్ పోస్టాఫీసులోని పోస్ట్ బాక్స్‌లో వేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ చంద్రబాబు తన నిజాయితీ నిరూపించుకోవాలన్నారు. ఆయన పాలనంతా అవినీతిమయమేనని ఆరోపించారు. వ్యవస్థలను మేనేజ్ చేసి ఇన్నాళ్లు ఆయన బయట తిరిగారన్నారు. బాబుపై నమోదైన కేసులన్నింటిలో స్టేలు ఎత్తేస్తే జీవితాంతం జైల్లో ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ ఆర్. చెన్నయ్య, ఎస్సీ సెల్ నాయకులు పస్తం అంజి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


పోస్టు కార్డులను పోస్ట్ బాక్స్‌లో వేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు

ఘనంగా మహాప్రసాద వినియోగం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో మహాప్రసాద వినియోగాన్ని ఘనంగా నిర్వహించారు. 11 రోజులుగా జరిగిన విజయదశమి ఉత్సవాలు బుధవారం ముగిశాయి.

శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామిమఠం, జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో ఈ నెల 15న ప్రథమ అఖండ స్థాపన చేసి ఉత్సవాలు ప్రారంభించారు. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో రోజూ ఓ అఖండ స్థాపన చేసి మహర్నవమి నాటికి మొత్తం తొమ్మిది అఖండాలను స్థాపించారు. బుధవారం రెండు మఠాలలో మహాప్రసాద వినియోగం కార్యక్రమం నిర్వహించారు. పెద్దమఠంలో మాతా గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామికి, చిన్నమఠంలో జగన్మాత శ్రీ ఈశ్వరీదేవికి మధ్యాహ్నం మహానైవేద్యం సమర్పించారు. అనంతరం ఆ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. రాత్రి ఆయుధపూజ, బలిహరణం కార్యక్రమాలు నిర్వహించారు. అఖండ ఉద్వాసన పలికి ఉత్సవాలు ముగించారు. కార్యక్రమాల్లో పెద్దమఠం పూర్వపు మఠాధిపతి శ్రీ వీరభోగవసంతవెంకటేశ్వర స్వామి కుటుంబ సభ్యులు, ఫిట్‌పర్సన్ సి.శంకర్‌బాలాజి, మేనేజర్ ఈశ్వరయ్య, చిన్నమఠం మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి, ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీ ఈశ్వరీదేవి


భక్తులకు మహాప్రసాదం పంపిణీ చేస్తున్న శ్రీవెంకటాద్రిస్వామి